

# కొద్దిగా వుందేమో

''భావరాజు బావగారికి కొద్దిగా వున్నట్టున్నదే కుసుమా! యాభై దగ్గరపడటం లేదూ'' సిద్ధంగా వున్న వడియాల పిండి గిన్నె అందుకున్నది జగదీశ్వరి.

ఎండలు వృధాకాకుండా రకరకాల వడియాల ప్రాజెక్టు మొదలెట్టారు. కొన్ని కుసుమ సూచిస్తే కొన్ని జగదీశ్వరి చెప్పింది. పక్కపక్కనే యిళ్లు. సరిహద్దు గోడ యెత్తులేదు. సగ్గుబియ్యంతోనూ, బియ్యపురవ్వతోనూ, బియ్యప్పిండి, గోధుమపిండి, అటుకుల వడియాలు, పేలాలతోనూ, మురుకుల వడియాలు, మినప్పిండి చామ వడియాలు, కంద వడియాలు, మిరప్పళ్లు వుప్పు నూరి కలిపిన మినపవడియాలు, గుమ్మడి కోరు సగ్గు జావా కలిపిన మరమరాల వడియాలు పేలాలతోనూ, బూడిద గుమ్మడి ముక్కలతోనూ, పొట్టు వడియాలు పెట్టి వినోదిస్తూ కబుర్లాడుతూ శ్రమ మరిచిపోతున్నారిద్దరూ. కూరలేకపోయినా యిబ్బంది లేదు. అన్నంలో వూరుబిండి వేసుకుని తింటారు.తరవాత అప్పడాల యజ్ఞం ప్లాన్ వేశారిద్దరూ. మంచం మీద మందపాటి తడిగుడ్డ పరిచి పెట్టేస్తున్నారు. పీటలమీదా బాటల్లోనూ గూడా పెట్టచ్చు. కొన్ని వుండలుగా అయితే కాలి హార్లిక్స్ సీసా మూతల్లో వుంచి బోర్లిస్తే బిళ్లలలాగా వస్తాయి. పొద్దెక్కకముందే పనిపూర్తి కావాలి. అవన్నీ యెండాక మళ్లా యెండబెట్టే పని. డబ్బాల్లో నిలవచేయాలి. జంతికల్లాగా గూడా పెడ్తున్నారు. చెయ్యి తెప్పల్లే చేస్తే నోరు పొత్తిలాగా తింటుందిట. ''యెందుకలా అనిపించింది జగన్'' అనడుగుతూ కుసుమ వడియాలు వరసగా పెట్టేస్తున్నది.

''అదొక అలవాటేమో! అన్నిటిలో తలదూర్చినా, అడక్కపోయినా సలహాలిచ్చినా మనకు సంబంధం లేని విషయాలు యెత్తినా అలా అనుకుంటారు. వరుసైన వాళ్లు ''కొద్దిగా వున్నట్టున్నదే వుసిరి కాయంత!'' అని నవ్వుకుంటారు అన్నది జగన్. పని మొదలెట్టింది. ''తాజా వార్తలా, అప్పుడప్పుడు విన్నవా, పొంచుండి విన్నవా అలా అనిపించటానికీ?'' తలవంచుకు నవ్వుతూ అడిగింది.

''నీ నవ్వు చూస్తే నీకూ అలాటి అభిప్రాయమే కలిగినట్టున్నదనిపిస్తుంది. మేనరికమేగా మీదీ? బావగార్ని గారం చేస్తున్నావో గౌరవిస్తున్నావో మరి'' జగదీశ్వరీ వరసన పెట్టేస్తున్నది.

''రెండూనూ. చెప్పు మరి. పని పూర్తి అయే లోపల ముగించాలి. మళ్లా యింట్లో పని అందుకోవాలి. పొద్దున యజ్ఞం కానిచ్చాం''.

''రాత్రి విందుకి పిలిచారు రాజుగార్ని తెలుసుగా? మా ఆయనపై అధికారి బదిలీ అయి వెళ్లిపోతున్నారు. వారి గౌరవార్థం యిచ్చారు. ఏడింటికల్లా మొదలు సురాపానం పేకాటతో మొదలైంది. మొత్తం డజను మంది. ఛిప్సు పకోడీలూ పళ్లేలలో వుంచి చల్లని సోడాలు ఓపెనరూ గ్లాసులూ బల్లమీదుంచా. రమ్మీ ఆడుతూ ధూమపానం, సురాపానం చేశారు. ఖబుర్లు చెప్పటంలో బావగారిదే పై చేయి. తక్కినవారు జోక్సు విసిరారు. సోడా కొట్టినచప్పుడు కబుర్లూ తలుపుసందునించీ కిటికీ నుంచి వినవచ్చాయి. ''చక్రపాణి అలా భార్యను రాచి రంపాన పెడితే, డామినేట్ చేస్తే ఆమె మొండి కేస్తుందే తప్ప లొంగిరాదు. ఆ మాటే చంద్రశేఖరంతో అంటే, పకాపక నవ్వి, ''నీకేల బాధ రాజూ! కందకులేని దురద కత్తి పీటకేల? భార్యకు హౌ టు డీల్ విత్ హిమ్ తెలుసు. సోషల్ వర్కర్, రేడియో స్టేషన్‌లో అనౌన్సర్, లేడీస్ క్లబ్ మెంబరై కుకింగ్ క్లాసెస్ తీసుకుంటున్నది. హోమ్ సైన్సెస్ స్టూడెంట్సు అటెండవుతారు''.

రమ్మీ సాగుతూ రౌండ్లు తిరుగుతున్నారు సోఫాల్లో. ''మా షడ్డకుడి తమ్ముడెంత మూర్ఖుడో అని విచారం గలిగింది చందూ! అన్నారు రాజుగారు. ''యెందుకు విచారం రాజూ?'' అని చంద్రశేఖరం గారు ప్రోత్సాహమిచ్చారు. వాడికంటె చిన్నవాడు సత్యం పోయాడు. ఆస్తి పంపకంలో తగాదా పడుతున్నారని తెలియగానే వెళ్లి పరిష్కరించాలనిపించింది. లా తెలుసు''.

''యెలా పరిష్కారమైంది? పిలవని పేరంటానికెందుకెళ్లావు?''

''విను మరి''. ''యెవరెవరికెంత వస్తుందో అంతా యిచ్చి, తమ్ముని మైనరు కొడుక్కీ మరదలు భృతికీ గూడా పంచి యిచ్చి, నీ వాటా నువ్వు తీసుకో